## సి.పి. బ్రౌన్ అకాడమి

తెలుగు భాష, సంస్కృతీ వికాసాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో సి.పి. బ్రౌన్ అకాడమి స్థాపించబడింది.

ముఖ్య కార్యక్రమాలు:

- ❖ తెలుగు వారి పిల్లలకు తమ భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని తెలియజెప్పి, వారు తెలుగు భాషాజ్ఞానం పెంచుకొనేందుకు సులభమయిన సరళమయిన బోధనా ప్రణాళికలు ఏర్పరచడం.
- ❖ తెలుగులో మంచి సాహిత్యాన్ని అందించగల రచయితలను ప్రోత్సహించటం మంచి పుస్తకాలను ప్రచురించడం.
- ❖ తెలుగు భాషలో ఉన్న పుస్తకాలను, పత్రికలనూ, పరిశోధన గ్రంథాలనూ సేకరించి 'డిజిటైజ్' చేయటం.
- ❖ తెలుగు భాషను వాడుకలో ఉన్న పరభాషా పదాలతో సుసంపన్నం చేసే 'కొత్త తెలుగు' ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రోత్సహించడం.
- ❖ 'సాహితీ స్రవంతి' అనే ద్వైమాస సాహిత్య పత్రికను ప్రచురించడం.
- ❖ తెలుగు సాహిత్యం లేక భాషకు తమ జీవిత కాలంలో ఎనలేని సేవ చేసిన ప్రముఖులను "తెలుగు భారతి పురస్కారం" (రెండున్నర లక్షల రూపాయల నగదు బహుమతి, బంగారు పతకం, సన్మాన పత్రం) తో సత్కరించడం.

అకాడమి ఆశయ సాధనలో సహకరించేందుకు, ప్రముఖ సాహితీవేత్తలు సభ్యులుగా ఒక సలహా మండలి కూడా ఏర్పరచటమయినది.


**సి.పి. బ్రౌన్ అకాడమి**

53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ 500082

ఫోన్: 040-23423188

www.cpbrownacademy.org


# తెలుగు భారతి - 2010
# పురస్కార ప్రదానోత్సవము



పురస్కార గ్రహీత

**ఆచార్య కొలకలూరి ఇనాక్**


**సి.పి. బ్రౌన్ అకాడమి**

53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ 500082

# ప్రశంసా పత్రం

కవి, కథకుడు, నవలాకారుడు, నాటకరచయిత, విమర్శకుడు, పరిశోధకుడు అయిన ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు స్వాతంత్ర్యానంతర కాలంలో తొలితరం తెలుగు రచయిత. అయిదున్నర దశాబ్దాలకుమించిన సాహిత్య జీవితం గల ఆచార్య కొలకలూరి భారత స్వాతంత్ర్యోద్యమం పతాకస్థాయికి చేరుకుంటున్న నేపథ్యంలో 1939 జూలై 1న గుంటూరు జిల్లా వేజెండ్లలో విశ్రాంతమ్మ రామయ్య దంపతులకు తొలిసంతానంగా జన్మించారు. క్రీ.శ. 18వ శతాబ్దంనాటి రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడి దగ్గర సైన్యాధికారిగా ఉండిన భుజంగరాయుడనే మహావీరుని వంశంలో ఏడో తరంలో జన్మించిన ఆచార్య కొలకలూరి గొప్ప విద్యావేత్త, సంస్కృతీపరులు, పాలనాదక్షులు.

ఆచార్య కొలకలూరి 1959లో ఆంధ్రవిశ్వకళాపరిషత్తులో బి.ఎ. ఆనర్సు పూర్తి చేసి, గుంటూరు ఎ సి కళాశాలలోను, చిత్తూరు, కాకినాడ, అనంతపురాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలోను లెక్చరర్‌గా పనిచేసి, 1974లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలో లెక్చరర్‌గా చేరారు. 1976లో అనంతపురంలోని పిజి సెంటర్‌కు రీడర్‌గా వెళ్ళి ఆచార్యుడై, కళాశాల ప్రిన్సిపాలై, సిండికేట్ సభ్యులై, 1999లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ అయ్యారు.

అభ్యుదయ రచయితగా, దళితరచయితగా ఆచార్య కొలకలూరి అన్ని ఆధునిక తెలుగుసాహిత్య ప్రక్రియలనూ చేపట్టి ప్రతిప్రక్రియనూ సుసంపన్నం చేశారు. కవిగా **ఆశాజ్యోతి, షరామామూలే, కులం-ధనం, చెప్పులు, త్రిద్రవ పతాకం, కలల కార్ఖానా, ఆది ఆంధ్రుడు, *Voice of Silence*** వంటి కావ్యాలు రాశారు. **సమత, అనాథ, సౌభాగ్యవతి, సౌందర్యవతి, ఎక్కడుంది ప్రశాంతి?, ఇరులలో విరులు, రెండుకళ్ళు-మూడుకాళ్ళు, అనంతజీవనం, సర్కారుగడ్డి** వంటి నవలలు రాశారు. **గులాబి నవ్వింది, భవాని, ఇదా జీవితం, ఊరబావి, సూర్యుడు తలెత్తాడు, అస్పృశ్యగంగ, కాకి, కొలుపు, కట్టడి** వంటి కథానికా సంపుటాలను ప్రచురించారు. **జైహింద్, కీ, మునివాహనుడు, సాక్షి, మనలాంటి మనిషి, దృష్టి, జ్యోతి, అభ్యుదయం, అమ్మ** వంటి నాటక సాహిత్యం అందించారు. **తెలుగు వ్యాసపరిణామం, సాహిత్యవ్యాసాలు, సాహిత్య దర్శిని, సమీక్షణం, ఆధునిక సాహిత్య విమర్శసూత్రం, శూద్రకవి శుభమూర్తి, వసుచరిత్ర వైశిష్ట్యం, జానపదుల సాహిత్యవిమర్శ, తెలుగులో తొలినవల** వంటి విమర్శ, పరిశోధన గ్రంథాలను వెలువరించారు. ఆచార్య కొలకలూరి పది మేజర్, పది మైనర్ రీసర్చి ప్రాజెక్టులు పూర్తి చేశారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం వంటి జాతీయ సంస్థలలో కీలకపాత్రలు పోషించారు.

ఆచార్య కొలకలూరి పర్యవేక్షణలో 24 మంది పిహెచ్.డిలు, 20 మంది ఎం.ఫిల్ పట్టాలు పొందారు. అంతేకాదు వారి సాహిత్యం మీద ఇరవైమంది పరిశోధించి పది పిహెచ్.డి., పది ఎం.ఫిల్ పట్టాలు వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పొందారు.

ఏ రచన చేసినా మానవకళ్యాణం వారి లక్ష్యం. సాంఘిక ఆర్థిక అసమానతలు పోవాలని, అందరూ కలిసి భయం లేని జీవితం గడపాలని, అచ్చమైన ప్రజాస్వామిక దేశంగా భారతదేశం రూపొందాలని కొలకలూరి సాహిత్యోద్దేశం. మానవుల మధ్య కుల, ధన, మత ద్వేషాలు నశించి ప్రేమ, మానవత్వం, ఆత్మగౌరవం వంటి ఆరోగ్యకరమైన సంబంధాలు కలగాలని కోరుకుంటున్న మానవతావాది ఆచార్య కొలకలూరి ఇనాక్.

ఆచార్య కొలకలూరి రచించిన **'ఆధునికాంధ్ర సాహిత్య విమర్శ సూత్రం'** 130 ఏళ్ళకుమించిన తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలోని పది గొప్ప విమర్శ గ్రంథాలలో ఒకటి. ఇంతవరకు ఎవరూ ఊహించని **'జానపదుల సాహిత్య విమర్శ'** వీరు వ్రాశారు. "మనిషి నా చైతన్యం! నా జీవితం! నా వ్యక్తిత్వం! నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను" అని చెప్పుకున్న కొలకలూరి గారికి సి.పి. బ్రౌన్ అకాడమి 'తెలుగు భారతి' పురస్కారం-2010 అందిస్తున్నందుకు గర్వపడుతున్నది.

హైదరాబాదు,

అక్టోబర్ 30, 2010

**సి పి బ్రౌన్ అకాడమి**